క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి : నియోజకవర్గ పరిధిలో గురువారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్కే రోజా పాల్గొననున్నారు. ఉదయం 8.30 గంటలకు పుత్తూరు పట్టణం అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో శ్రీసొరకాయలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం వడమాల పేట మండలం ఎంఎస్ ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన తుడా పార్క్‌ను ప్రారంభిస్తారు. పత్తి పుత్తూరు పంచాయతీ ఇర్ల పాలెంలో రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. తర్వాత ఎస్వీఆర్ కండ్రిగలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారు. ఈ మేరకు బుధవారం మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

జగనన్న గోరుముద్ద నాణ్యత పరిశీలన



జగనన్న గోరుముద్ద అమలును పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం మెనూ ప్రకారం నాణ్యతాప్రమాణాలతో విద్యార్థులకు భోజనం పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. బుధవారం తిరుమలరాజుపురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. భోజన నిర్వాహకులతో ఆయన పైవిధంగా మాట్లాడారు. మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



వసతులను పరిశీలిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: రాబోవు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మండలంలోని 41 పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయనున్నట్టు పాఠశాలల్లో ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు..మొదలైన వసతులు కల్పించాలన్నారు. 26 పోలింగ్ కేంద్రాల్లో వసతులు సరిగా లేవని, 25వ తేదీ నాటికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ. 6 లక్షలు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంఈఓ మహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

కాయగూరల సాగుపై రైతన్న చూపు

విజయపురం (నగరి) : ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలల్లో ఆశించిన స్థాయిలో లాభలేకపోవడంతో.. రైతులు అంతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా వంగ, చిక్కుడు, బెండ, గోరు చిక్కుడుకాయ, బీన్స్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. విజయపురం, జగన్నాథపురం, మహారాజపురం, మల్లారెడ్డికండ్రిగ, కోసలనగరం, జంబాడ, పాతర్కాడు తదితర గ్రామాల్లో సుమారు 100 ఎకరాలకు పైగా అంతర పంటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆశాజనకంగా ఉండడం, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే అవకాశం ఉండడంతో అంతర పంటల సాగు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

వెలవెలబోయిన జయహో బీసీ సభ

నాగలాపురం: టీడీపీ నేతలు బుధవారం ఆడంబరంగా ఏర్పాటు చేసిన జయహో బీసీ సభ నాయకులు, కార్యకర్తలు లేక వెలవెలబోయింది. నియోజకవర్గ ఇన్‌చార్జి హెలెన్ వ్యతిరేక వర్గం ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టింది. స్థానిక ఆర్ఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ సభను బీసీ వర్గాలే బహిష్కరించాయి. కనీసం 20 మంది కూడా లేకుండానే కార్యక్రమాన్ని మమ అనిపించారు. హెలెన్ వద్ద నాయకులు తమ కష్టాలను వాపోయినట్లు సమాచారం. కార్యకర్తల పేర్లు చెప్పి పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసయాదవ్ వేలకు వేలు డబ్బులు వసూలు చేస్తున్నారని టీడీపీ నేత, నాగలాపురం ఫస్ట్ వార్డు మెంబర్ ఏలుమలై తీవ్రంగా దుయ్యబట్టారు. కదలిరండి కార్యక్రమానికి 500 మందిని తీసుకొస్తామని చెప్పి రూ.1.65 లక్షలు కాజేశారని మండిపడ్డారు. ఇలాంటి వారిని నమ్మి పార్టీలో ఎలా పనిచేయా పనిచేయాలో అర్థం కావడం లేదని వాపోయారు. ఈ కారణంగానే తాము పార్టీ కార్యక్రమాన్ని బహిష్కరించినట్లు పలువురు బీసీ నాయకులు సైతం పెదవివిరిచారు. కనీసం 20 మంది కూడా కార్యకర్తలు లేకపోవడంతో నాయకులపై హెలెన్ ఒకింత అసహనం వ్యక్తం చేసి, కేవలం 20 నిమిషాల్లో కార్యక్రమాన్ని ముగించడం విశేషం

చదువుల బడి.. అమ్మ ఒడి

- తల్లుల్లో ఆనందాల సవ్వడి
- వరుసగా 4వ ఏడాదీ పథకం అమలు
- కోరిన వారికి ల్యాప్‌టాప్‌లు

విడతల వారీగా అందిన అమ్మ ఒడి

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య
2019-2020	15,785
2020-2021	16,353
2021-2022	17,815
2022-2023	18,314



కార్వేటినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకంతో నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్నారులు పాఠశాలలకు దూరం కాకుండా చేస్తున్నారు. ఈ పథకాన్ని నాలుగో విడత సైతం సకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమయాత్తమైంది. దీనిపై విద్యాశాఖతో పాటు సచివాలయ వ్యవస్థ ఇతర ప్రభుత్వ శాఖలు కసరత్తు ప్రారంభించాయి.

18,314మంది తల్లుల ఖాతాకు..

గంగాధరనెల్లూరు నియోజకవర్గం స్థాయిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్మీడియెట్ చదువుతున్న 18,314 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో గత ఏడాది ప్రభుత్వం ప్రకటించిన సొమ్ము జమ చేసింది. రానున్న విద్యాసంవత్సరంలో లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అర్హులందరికీ అమ్మ ఒడి

వెబ్‌సైట్‌లో ఉన్న జాబితా మేరకు లబ్ధిదారుల బయోమెట్రిక్ ద్వారా సచివాలయ విద్య కార్యదర్శి అథెంటిఫికేషన్ చేయనున్నారు. జాబితా పరిశీలన చేసి అన్నీ సవ్యంగా ఉన్నాయా, లేదా? అనేది ధ్రువీకరిస్తారు. ఆధార్ కార్డు, వేర్వేరు బ్యాంకు ఖాతాలకు అనుసంధానమై ఉంటే సాంకేతిక సమస్యలు తలెత్తి గత ఏడాది కొంత గందరగోళ పరిస్థితి తలెత్తింది. ఈ పర్యాయం అలాంటి సమస్యలు లేకుండా ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. తుది జాబితా రూపకల్పనకు కసరత్తు చేస్తున్నారు.

> **అర్హులందరికీ పథకం**
>
> 
>
> అమ్మ ఒడి పథకం అర్హులందరికీ వర్తిస్తుంది.ఇప్పటికే విద్యార్థుల తల్లుల నుంచి తీసుకున్న వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం, నగదు లేదా ల్యాప్‌టాప్ ఏది కోరుకుంటే అది ఇస్తాం. అమ్మ ఒడి పథకం లబ్ధిదారులను కుదిస్తున్నారని, అర్హుల పేర్లను తొలగిస్తున్నారని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.ఇవన్నీ అపోహాలు మాత్రమే
>
> – ఎం.విజయ్‌కుమార్, ఎంఈఓ, కార్వేటినగరం

మా పిల్లలకు మేనమామ సీఎం జగనన్న



మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. పిల్లలను చదువుకు ఇబ్బందులు పడుతున్న సమయంలో సీఎం జగనన్న అధికారానికి వచ్చి మా పిల్లలకు అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందించడమే కాకుండా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా యూనిఫాం అందించారు. మా పిల్లలకు మేనమామగా నిలుస్తున్న జగనన్నకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

–ఎం.పద్మ, విద్యార్థి తల్లి, గోపిశెట్టిపల్లె, కార్వేటినగరం

అప్పుల బాధ తీరింది



గతంలో పాఠశాలలు తెరుస్తున్నారంటే యూనిఫాం, పుస్తకాల కొనడానికి, ఫీజులు చెల్లించడానికి అప్పులు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు అమ్మ ఒడి పథకం పుణ్యమా అని ఆ బాధ తప్పింది. పిల్లల చదువుకోసం జగనన్న రూ.15వేలు అందించి ఆదుకుంటున్నారు. మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

– డి.భార్గవి, విద్యార్థి తల్లి, విడిదిపల్లె, పెనుమూరు మండలం

మా కుటుంబానికి తోడు..నీడై



మాకు ఎలాంటి ఆస్తులు లేవు. ఉండేందుకు ఇల్లు మాత్రమే ఉంది. పిల్లలను బాగా చదివించాలనే ఆశ ఉంది. అయితే మాకంత స్థోమత లేదు. జగనన్న అధికారంలోకి వచ్చాక మా పిల్లలకు అమ్మ ఒడితో చదువుల కష్టాలు తీరాయి. మేము జగనన్నకు ఎప్పుడూ అండగా ఉంటాం.

– బి.దేవి, విద్యార్థి తల్లి, విడిదిపల్లె, పెనుమూరు మండలం

మాట నిలబెట్టుకున్న సీఎం



ఎన్నికల్లో జగనన్న ఇచ్చిన మాటను అధికారంలోకి రాగానే నిలబెట్టుకున్నారు. విద్యార్థులకు అమ్మ ఒడి పథకం కింద ప్రతి సంవత్సరం పిల్లల తల్లి ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తున్నారు. పిల్లల చదువుకోసం అప్పులు చేయాల్సిన అవసరం లేదు. జగనన్నే మా పిల్లలకు పెద్ద దిక్కుగా నిలిచారు. ఆయన చేసిన మేలును మరచిపోము.

– టీ.బొమ్మి, విద్యార్థిని తల్లి, గోపిశెట్టిపల్లి, కార్వేటినగరం

సీఎంగా జగనన్నే ఉండాలి



ఎక్కడ లేని విధంగా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఇంగ్లీసు మీడియం పెట్టి, మా పిల్లలకు అమ్మ ఒడి పథకంతో జగనన్న ఆదుకుంటున్నారు. ఆయన సాయం ఊరికే పోదు. మా పిల్లల్ని బాగా చదివిస్తాం. జగనన్నకు మేము, మా పిల్లలు రుణపడి ఉంటాం. మా కుటుంబానికి పెద్ద దిక్కు జగనన్నే.

– డి.పద్మావతి, విద్యార్థిని తల్లి, విడిదిపల్లె, పెనుమూరు మండలం

పిల్లల చదువుకు అండ



ఎంతో మంది ముఖ్యమంత్రులుగా వచ్చారు. పిల్లలు, వారి చదువులను పట్టించుకోలేదు. జగనన్న మాత్రం అట్లా కాదు. అమ్మ ఒడి ఇచ్చారు. నాడు–నేడుతో స్కూళ్లను బాగు చేశారు. ప్రైవేటు స్కూళ్లకంటే గొప్పగా చేసినారు. మా పిల్లల చదువులకు అండగా నిలిచిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– రాణి, విద్యార్థి తల్లి, ఈదువారిపల్లె, కార్వేటినగరం

బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి



నగరి: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

నగరి : బాలికలను చదువుతోపాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని, లింగ వివక్ష వీడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ నేడు సమాజంలో బాలికలు వివిధ రంగాల్లో తమ ప్రత్యేకతను చాటుకుంటూ ముందంజలో ఉన్నారన్నారు. రక్షణ, అంతరిక్షం, సాఫ్ట్‌వేర్, విద్య, వైద్యం, క్రీడలు తదితర అనేక రంగాల్లో ప్రతిభను చాటుతున్నారని తెలియజేశారు. వారిలోని తెలివితేటలను సమాజానికి ఉపయోగపడేలా చేయూతనిస్తే సమాజం సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్ రాజు మాట్లాడుతూ బాలికల అభ్యున్నతికి ప్రభుత్వాలు అనేక రకాలుగా కృషి చేస్తున్నాయని, భేటీ బచావో– భేటీ పడావో, ఎన్నికల్లో రిజర్వేషన్లు, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, బాలికలకు ప్రత్యేక విద్యాలయాలు ఇందులో భాగమేనని తెలిపారు. బాలికలను వివక్ష లేని సమాజంలో పెరిగేలా చూడాలని, అది కుటుంబంలోను, విద్యాలయాల్లోను ప్రారంభం కావాలన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

పశువుల వ్యాధులపై అప్రమత్తం



పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్న మహేశ్వరరెడ్డి

పాలసముద్రం: పాడిపశువులకు వచ్చే వ్యాధులపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి భానుప్రసాద్ అన్నారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏసీఓ ఈ.మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 35 పాడిపశువులకు వైద్య పరీక్షలు చేసి పిడుగు మందులు పిచికారీ చేశారు. తక్కువ ధరకు కాల్షియం, మినరల్ మిక్చర్‌ను పాడిరైతులకు అందజేశారు. పాడిరైతులతో మహేశ్వరరెడ్డి మాట్లాడారు.గతంలో కురిసిన వర్షాలకు పాడి పశువులకు గాలికుంటు వ్యాధి ఎక్కువగా వస్తోందని, దీని బారిన పడకుండా ఉండేందుకు వాటికి టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మారి, రీగన్, పాడి రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం



నగరి : ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందించారు. గర్భిణులు వైద్య పరీక్షలకు వచ్చిన సమయంలో ఎలాంటి ఇబ్బందులు పడకూడదని ఉచిత భోజనం అందించే మహత్తర కార్యక్రమాన్ని మంత్రి ఆర్కే రోజా నిరంతరంగా నిర్వహిస్తున్నారు. గర్భిణులతో పాటు వారి వెంట వచ్చే వారికి కూడా ఉచితంగా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదీనా చట్నీ, చిక్కీ, అరటి పండు, రైతాతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నారు. బుధవారం మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి, ఆర్ఎంవో మంజుల, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ గర్భిణులకు భోజనం పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీల దుర్మరణం



మృతి చెందిన బిహార్ కూలీలు

పెనుమూరు(కార్వేటినగరం) : చిత్తూరు– పెనుమూరు రహదారిపై మఠంపల్లి క్రాస్ వద్ద బుధవారం రాత్రి ఎదురుగా వస్తున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పెనుమూరు ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్ కథనం మేరకు. కలవకుంట(ఎన్టీఆర్ జలాశయం) వద్ద ఉన్న ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న బిహార్‌కు చెందిన ఇద్దరు కూలీలు ద్విచక్ర వాహనంపై పెనుమూరు మండల సాతంబాకం గ్రామానికి వచ్చారు. పని ముగించుకుని కలవకుంటకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో మఠంపల్లె వద్ద చిత్తూరు నుంచి ఎదురుగా వస్తున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కూలీలు ఇద్దరూ అక్కడిక్కడే మృతి చెందారు. మృతుల పూర్తి వివరాల కోసం అక్కడి కూలీలను ఆరా తీస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



హోరాహోరీగా వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



వాలీబాల్ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచిన గంగాధర నెల్లూరు జట్టు

- హోరాహోరీగా నియోజకవర్గస్థాయి వాలీబాల్, ఖోఖో పోటీలు



జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన పాలసముద్రం బాలికల జట్టు



నియోజకవర్గ స్థాయి పోటీలను చిత్తూరు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవితో కలసి ప్రారంభిస్తున్న ఎంపీపీ అనిత

గంగాధర నెల్లూరు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలకు సంబంధించి బుధవారం నియోజకవర్గ స్థాయి పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండల స్థాయిలో గెలుపొందిన ఆరు మండలాల క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీలకు వచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో చిత్తూరు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవితో కలిసి ఎంపీపీ అనిత లాంఛనంగా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యువత కోసం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విన్నర్స్, రన్నర్స్ జట్లకు ప్రభుత్వం నగదు బహుమతులు ఇస్తుందని, అలాగే ఈ పోటీలలో గెలుపొందిన వారు గెలుపొందిన వారికి ప్రభుత్వం బహుమానాలు కూడా ఇస్తున్నారని, ప్రతిభ కనబరచిన వారిని జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలకు కూడా ఎంపిక చేస్తారన్నారు.

వాలీబాల్ విన్నర్స్ గంగాధరనెల్లూరు

వాలీబాల్ క్రీడల పురుషుల విభాగం ఫైనల్స్‌లో గంగాధర్ నెల్లూరు మండలం జట్టు కార్వేటినగరంపై గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించింది. అలాగే మూడవ స్థానంలో శ్రీరంగరాజపురం జట్టు నిలిచింది. మహిళల విభాగం ఫైనల్స్‌లోనే గంగాధరనెల్లూరు జట్టే విజయం సాధించింది. రన్నర్స్‌గా వెదురు కుప్పం, మూడవ స్థానంలో కార్వేటినగరం జట్లు నిలిచాయి.

ఖోఖో విన్నర్స్ పాలసముద్రం, కార్వేటినగరం

మహిళల విభాగం ఖో–ఖోలో పాలసముద్రం, పురుషుల విభాగంలో కార్వేటినగరం జట్లు విన్నర్స్‌గా నిలిచాయి.మహిళల విభాగం ఫైనల్స్‌లో కార్వేటి నగరంపై పాలసముద్రం గెలవగా, గంగాధర్ నెల్లూరు జట్టు మూడవ స్థానంలో నిలిచింది. పురుషుల విభాగం ఫైనల్స్‌లో రన్నర్స్‌గా ఎస్సార్ పురం, మూడోస్థానంలో వెదురుకుప్పం నిలిచాయి. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు త్వరలో చిత్తూరు జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తారని ఆడుదాం ఆంధ్ర ప్రత్యేక అధికారి విద్యాసాగర్ చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిబాబు, స్థానిక సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుధాకర్, ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గస్థాయి నిర్వహణ కమిటీ చైర్మన్ వ్యాయామోపాధ్యాయులు సెల్వ పాండియన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

జిల్లా ఖోఖో పోటీలకు ఎంపిక

పాలసముద్రం : గంగాధరనెల్లూరులో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడల ఖో–ఖో విభాగంలో పాలసముద్రం మండల బాలికల జట్టు జిల్లా పోటీలకు ఎంపికైందని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. క్రీడాకారిణులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు ఎస్.వినోద్‌కుమార్, శివ, అన్బరసన్, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణతోనే ఓట్ల మార్పు

- గ్రామ సభలోనూ విచారించాం
- తహసీల్దార్ వెంకట్రాయలు

విజయపురం (నగరి) : మండలంలోని పన్నూరు దళితవాడలో అధికార పార్టీ ఒత్తిళ్లతో టీడీపీకి చెందిన వారి ఓటు మార్చారని ఎల్లోమీడియాలో వచ్చిన అవాస్తవ ఆరోపణలు అధికారులను సైతం విస్తుపోయేలా చేసింది. దీంతో విజయపురం తహసీల్దార్ వెంకట్రాయలు వాస్తవాలను బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. పన్నూరు దళితవాడకు చెందిన బెంజిమెన్, బి.కరుణ, మురగమ్మ పోలింగ్ స్టేషన్ 212, 213 పరిధిలో నివాసం లేదని, వారి ఓటును తొలగించాలని ఫారమ్ 7 నమోదు కావడంతో సమగ్ర విచారణ చేసినట్లు తెలిపారు. బెంజిమన్‌తో పాటు ఇతర గ్రామస్తులు ఈ అంశంపై పన్నూరు దళితవాడలోని మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారన్నారు. గ్రామ సభలో బెంజిమన్, అతని కుటుంబ సభ్యులు నివాసం లేదని, వారు పన్నూరు సబ్‌స్టేషన్, సామిరెడ్డి కండ్రిగలో పోలింగ్ స్టేషన్ నెంబరు 204లో నివాసం ఉంటున్నట్లు రుజువైందని పేర్కొన్నారు. దీంతో బెంజిమెన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుల ఓట్లు వారు ప్రస్తుతం నివాసమున్న పోలింగ్ స్టేషన్ నెంబరు 204కు మార్చినట్లు వివరించారు. ఆ పోలింగ్ స్టేషన్‌లో వరుస నెంబరు 771,772, 773లో వారి ఓటు ఉందన్నారు. ఈ అంశంపై ఒత్తిళ్లు జరిగిందన్న విషయం అవాస్తవమని తెలిపారు.

ఐరన్ మాత్రలతో రక్తహీనత దూరం



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: పిల్లల్లో రక్తహీనత సమస్య అధిగమించడానికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఎంతగానో దోహదపడుతాయని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ అన్నారు.. బుధవారం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడంతోపాటు గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు చేశారు. మందులు అందజేశారు. గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేసుకోవాలని, కాన్పునిమిత్తం ప్రభుత్వం ఆస్పత్రిలో చేరాలని డాక్టర్ కోరారు. సూపర్‌వైజర్ సుశీల, మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న జోనల్ అధికారి మురళి

నిండ్ర: ఆయిల్ పామ్ తోటల సాగుతో అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చని జోనల్ మేనేజర్ మురళి తెలిపారు. బుధవారం మండలంలోని జీఎస్ కండ్రిగ గ్రామంలో 3ఎఫ్ ఆయిల్ ఫామ్ అయిల్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. మురళి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చని, కూలీల సమస్య ఉండదని, పంటను సులభంగా అమ్ముకోవచ్చని వివరించారు. రైతులకు 3ఎఫ్ ఆయిల్ ఫామ్ అయిల్ సంస్థ ప్రతినిధులు అందుబాటులో ఉంటూ సలహాలు అందిస్తారని తెలిపారు. సంస్థ జిల్లా కోర్డినేటర్ రెడ్డిరామ్, హార్టీకల్చర్ అధికారి లోకేష్, మండల వ్యవసాయాధికారి తులసిరాం , మండల కో–ఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఐగా దివాకర్‌రెడ్డి



దివాకర్‌రెడ్డి

సత్యవేడు: సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దివాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీశైలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. సీఐ మాట్లాడుతూ, సత్యవేడు, వరదయ్యపాళెం, నాగలాపురం మండలాల్లో ఇసుక, మట్టి, మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే, ఈ మండలాల్లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ ప్రతాప్

వరదయ్యపాళెం: ఎస్ఐగా ప్రతాప్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నిబంధనల మేరకు జరిగిన బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా సంజ్యామల స్టేషన్ నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డిని సైతం బదిలీ చేశారు. ఇంకా పోస్టింగ్ కేటాయించలేదు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి స్వామిని బుధవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. గోవా మంత్రి మావిస్ గొడింగో, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి జేఎన్టీయూ ప్రొఫెసర్ శ్రీనివాసరావు దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఈవో కేఎస్ రామారావు వారికి స్వాగతంపలికి దర్శన ఏర్పాట్లు చేశారు.